క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

అట్లూరు : మండల పరిధిలోని ఎస్. వెంకటాపురంలోని మల్లినేనిపట్నం కాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శనివారం సీతారామ లక్ష్మణ విగ్రహాలను వైభవంగా ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్ రొండా మాధవరెడ్డి, మాజీ అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ రొండా మల్లికార్జునరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు చిన్నా, సర్పంచ్ గంగమ్మ, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

కంటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : కంటి ఆరోగ్యం పట్ల విద్యార్థులు శ్రద్ధ వహించాలని ఆప్తాలమిక్ ఆఫీసర్ కేజే రఘురామిరెడ్డి తెలిపారు. స్థానిక రెండో వార్డు మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం జిల్లా అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా 36 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి ఆరోగ్యం కోసం ఆకు కూరలు, గుడ్లు, కూరగాయలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు గీత, సీఓ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు సుందరం, రామచంద్ర, హెల్త్ సెక్రటరీ రెబక, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

డిజిటల్ మోసాలపై అవగాహన

ఖాజీపేట : విద్యార్థులు డిజిటల్ మోసాలపై పూర్తిస్థాయి అవగాహన కల్గి ఉండాలని ఖాజీపేట సీఐ మోహన్ సూచించారు. ఖాజీపేట బాలురోన్నత పాఠశాలలో డిజిటల్ మోసాలు.. ట్రాఫిక్ నిబంధనలపై శనివారం ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ఫోన్‌పే లేక గూగుల్‌పే చేస్తున్నాం అంటూ ఓటీపీ అడుగుతున్నారన్నారు. ఎవ్వరూ ఎవ్వరికీ ఎలాంటి ఓటీపీలు చెప్పాల్సిన పనిలేదన్నారు. చాలామంది యువకులు డిజిటల్ గేమ్స్ మోజులో పడి డబ్బు పోగొట్టుకుంటున్నారన్నారు. దీంతో ప్రమాదాలను అరికట్టవచ్చునని తెలిపారు.

వీల్స్ ఇండియా కంపెనీకి ఎంపిక



వీల్స్ ఇండియా కంపెనీకి ఎంపికైన విద్యార్థులతో సీబీఐటీ యాజమాన్యం

చాపాడు : ఈ నెల 11న ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రాంగణంలో వీల్స్ ఇండియా కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) విద్యార్థులు 16 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. డిప్లమో ఈఈఈ ఫైనలియర్‌కు చెందిన 16 మంది విద్యార్థులు రాత పరీక్ష, ఇంటర్వ్యూలలో ప్రతిభ చూపి రూ.2.5 లక్షల వార్షిక వేతనంతో ఎంపికైనట్లు అకడమిక్ డీన్ డా.జి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. సీబీఐటీ చైర్మన్ డా.వి.జయచంద్రారెడ్డి ప్రిన్సిపల్ డా.ఎస్.శృతి, అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని బీసీ, ఈబీసీ, బ్రాహ్మణ, కాపు, బలిజ, తెలగ, క్షత్రియ, కమ్మ, రెడ్డి, వైశ్య కులాలకు చెందిన అభ్యర్థులకు సబ్సిడీ రుణాలకు సంబంధించి ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 17, 18వ తేదీలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు తమ అప్లికేషన్, ఆధార్, రేషన్ కార్డులు, ఆదాయ, కుల ధ్రువీకరణ ఒరిజనల్ పత్రాలు, జిరాక్స్ కాపీలు, ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రొద్దుటూరు : ప్రభుత్వం ప్రవేశపెట్టిన చంద్రన్న స్వయం ఉపాధి 2024–25 సంవత్సరానికి గాను సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 19న ఉదయం 10.30 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకుని ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

తహసీల్దారు కార్యాలయానికి ఉత్తమ అవార్డు

ఖాజీపేట : రెవెన్యూ కార్యకలాపాలు పకడ్బందీగా నిర్వహించినందుకు ఖాజీపేట తాహసీల్దారు కార్యాలయానికి కడప డివిజన్ పరిధిలో ఉత్తమ అవార్డు దక్కింది. ఇటీవల గ్రామసభలు పెట్టి సమస్యలను వేగంగా పరిష్కరించడం, తహసీల్దారు, వీఆర్‌ఓలు, సర్వేయర్లు ఉత్తమ పనితీరు కనబరచడంతో ఈ అవార్డు దక్కింది. కలెక్టర్ శ్రీధర్ చేతుల మీదుగా తహసీల్దారు మహబూబ్ బాషా, సిబ్బంది శనివారం ఈ అవార్డు అందుకున్నారు. కష్టపడినందుకు మంచి గుర్తింపు రావడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు.

నాలుగేళ్లుగా ఏఈ పోస్టు ఖాళీ

ఖాజీపేట మండలంలో విద్యుత్తు శాఖ అసిస్టెంట్ ఇంజినీరు లేరు. ఉన్నతాధికారులు బదిలీపై పంపినా విధులకు చేరకుండానే వెళ్లిపోతున్నారు. ఏఈలు లేక నాలుగేళ్లు గడచిపోయాయి. సబ్ ఇంజినీర్లతోనే పనులు చేయిస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లతో వచ్చేందుకు ఎవ్వరూ ముందుకు రావడం లేదని అధికారులు చర్చించుకుంటున్నారు.

- విముఖత చూపుతున్న అధికారులు
- స్థానిక రాజకీయాలే కారణమా?



ఖాజీపేట సబ్ స్టేషన్

ఖాజీపేట : మండలంలో 2021లో విద్యుత్ శాఖ ఏఈగా రాజగోపాల్ బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి నేటి వరకూ ఏఈగా వచ్చేందుకు ఎవరూ సుముఖత చూపడంలేదు. గతంలో జరిగిన బదిలీల్లో అన్ని మండలాలకు బదిలీలు జరిగినా ఖాజీపేటకు మాత్రం ఎవ్వరూ రాలేదు. కనీసం దరఖాస్తు కూడా చేసుకోలేదు. సాధారణ బదిలీల్లో భాగంగా గత నెలలో ఒకరిని ఉన్నతాధికారులు నియమించినా ఆయన విధుల్లో చేరకుండానే వెళ్లిపోయారు.

సబ్ ఇంజినీర్లే ఆధారం

మండలంలో విద్యుత్తు సమస్యలు వస్తే సబ్ ఇంజినీర్లు అంతా తామై నడిపిస్తున్నారు. 2021 నుంచి ఇప్పటి వరకూ ముగ్గురు సబ్ ఇంజినీర్లు మారారు. తాజాగా వచ్చిన సబ్ ఇంజినీర్ ఖాజీపేట ఇన్‌ఛార్జి ఏఈగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడకు ఎవ్వరూ ఏఈగా రాకపోవడానికి రాజకీయ ఒత్తిడే కారణంగా కనిపిస్తోంది. ఖాజీపేట టౌన్‌లో తరచూ విద్యుత్తు అంతరాయం కలగడం, పాడుబడిన తీగలు ఉండటం, ట్రాన్స్‌ఫార్మర్‌కు సరైన ఆన్ ఆఫ్ స్విచ్ లేకపోవడం, పొలాల్లో విద్యుత్తు స్తంభాలు పడిపోవడం, తీగలు వేలాడుతూ ఉండడం వంటి సమస్యలు ఉన్నాయి. తమ సమస్యలు పరిష్కరించాలని అధికారుల చుట్టూ నిత్యం రైతులు తిరుగుతున్నారు. పూర్తి స్థాయిలో సేంలందించలేని పరిస్థితి సబ్ ఇంజినీర్లది. పనిభారం అధికంగా పడడమే ఇందుకు కారణం. విద్యుత్తు పరికరాలు రాకపోవడం మరోకారణం. నిబంధనలు పాటించకుండా ఉండడంతో ఏఈలు విముఖత చూపుతున్నారు.

ఏఈగా ఎవ్వరైనా వస్తే సంతోషం

ఖాజీపేట ఏఈగా విధులు నిర్వహించేందుకు ఎవ్వరైనా ముందుకు వచ్చి విధుల్లో చేరితే సంతోష. ఎలాంటి ఇబ్బందులుండవు. మాకు పనిభారం తగ్గుతుంది. ఉన్నతాధికారులు ఆ పోస్టు భర్తీ చేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– శ్రీనివాసులురెడ్డి, ఏడీఏ, మైదుకూరు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న అర్బన్ సీఐ రాజగోపాల్

బద్వేలు అర్బన్ : విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకుని రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌రావు, అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎస్ఆర్ఎస్‌బీ డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణ – తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ విద్యార్థులు తమ వాహనాలను పరిమిత వేగంతో నడపడంతో పాటు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని సూచించారు. అలాగే సెల్‌ఫోన్ డ్రైవింగ్ చాలా ప్రమాదకరమని తెలిపారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల కలలను వమ్ము చేయకుండా జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. ప్రతిఒక్కరు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల పరిపాలనాధికారి ఆర్.వి.సాయిక్రిష్ణ, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎంవీఐ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

పోరుమామిళ్ల : ప్రైవేటు స్కూల్ బస్సు డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటించాలని సీఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం స్కూల్ బస్సు డ్రైవర్లు, క్లీనర్లకు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ కొండారెడ్డి, పోలీసు సిబ్బంది, స్కూల్ బస్సు డ్రైవర్లు, క్లీనర్లు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులతో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

కలసపాడు : మండలంలోని మామిళ్ళపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి పురుషోత్తంరెడ్డి సోదరుడు, ఉపాధ్యాయుడు పెద్దిరెడ్డి రమణారెడ్డి, లక్ష్మిదేవి కుమారుడు రవిచంద్రారెడ్డి, హిమబిందు వివాహ వేడుక పోరుమామిళ్లలోని వసుంధర కల్యాణ మండపంలో జరిగింది. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, పులివెందుల మాజీ మున్సిపల్ చైర్మన్ వై.ఎస్.మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డిలు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. నియోజకవర్గ బూత్ కన్వీనర్ల అధ్యక్షుడు రమణారెడ్డి, గురివిరెడ్డి, సూదా రామకృష్ణారెడ్డి, సుదర్శన్, నారాయణ యాదవ్, చిత్తారాజశేఖర్‌రెడ్డి, దేవసాని శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

పరిశుభ్రత, పర్యావరణంపై అవగాహన



ప్రొద్దుటూరు : స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సచివాలయ సిబ్బంది



దువ్వూరులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు



ఖాజీపేట బస్టాండ్ కూడలిలో మానవహారం



నాలుగు రోడ్ల కూడలిలో ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రొద్దుటూరు : మండలంలోని నరసింహాపురం గ్రామంలో వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత, పర్యావరణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహాపురం వీధుల్లో 100 మంది విద్యార్థులు, అధ్యాపకులు, గ్రామ సచివాలయ సిబ్బంది తిరుగుతూ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్ధేశ్వరరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామమోహన్‌రెడ్డి, డాక్టర్ ఎంవీవీ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రామాంజనేయరెడ్డి, శ్రీనివాసులు, డాక్టర్ కె.సుబ్బరాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రత.. ప్రతి ఒక్కరి బాధ్యత

దువ్వూరు : వ్యక్తిగత పరిశుభ్రత.. పరిసరాల పరిశుభ్రత అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ రామకృష్ణయ్య తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయం నుంచి దువ్వూరు సెంటర్ వరకు ర్యాలీ చేశారు. మానవ హారంగా ఏర్పడి పరిసరాల శుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్‌ను అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెంద్రాయుడు, సత్యనారాయణ, ఎస్ఐ వినోద్ కుమార్, ఎంఈఓ భాస్కర్, డీఈ రమేష్ బాబు, వరలక్ష్మి, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్రపై ర్యాలీ

మైదుకూరు : స్వచ్ఛ ఆంధ్రపై అవగాహన ర్యాలీ కల్పించేందుకు శనివారం పట్టణంలో మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నుంచి రాయల కూడలి వరకు ఈ ర్యాలీ సాగింది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ర్యాలీలో పాల్గొన్న వారు నినాదాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు రెడ్డి, మున్సిపల్, వైద్య సిబ్బంది, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాన్ని శుభ్రంగా ఉంచాలి

ఖాజీపేట : గ్రామాన్ని శుభ్రంగా ఉంచాలని ఇన్‌ఛార్జి ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. ఖాజీపేట మేజర్ పంచాయతీలో శనివారం ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా నిలిచి చెత్తపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పొడి చెత్త, తడి చెత్తను వేరుగా చేసి ఉంచాలని, పంచాయితీ సిబ్బంది వచ్చినప్పుడు ఇవ్వాలని సూచించారు. పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పుల్లూరులో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. సర్వర్ ఖాన్ పేట వరకూ ర్యాలీ నిర్వహించి స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

చాపాడు : వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం చాపాడు గ్రామంలో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ చేపట్టారు. స్థానిక సచివాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకూ ప్లకార్డులు చేతబట్టి ప్రజాప్రతినిధులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వీరకిషోర్, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, సర్పంచ్ మహబూబ్‌బీ, అధికారులు మ్యాగీ, రాజేష్ కుమార్, శ్రీవాణి, రవిశంకర్, వంశీకృష్ణ, శ్రీధర్, హర్షవర్ధన్‌రెడ్డి, సలీం, మస్తాన్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ

బ్రహ్మంగారిమఠం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు బ్రహ్మంగారిమఠంలోని నాలుగు రోడ్ల కూడలిలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, నాయకులు ఎస్సార్ శ్రీనివాసులరెడ్డి, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఆయాగ్రామాల కార్యదర్శులు, స్థానికులు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం సమీపంలోని వ్యాపారులకు తడి, పొడి చెత్త బుట్టలు అందించారు. స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేశారు.

స్వచ్ఛాంధ్రపై ప్రతిజ్ఞ

బి.కోడూరు : స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో శనివారం బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో వైద్యాధికారులు, వైద్యసిబ్బంది పరిసరాలను శుభ్రం చేసి అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దీని వలన వ్యాధులు దరిచేరవని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నాగమణి, పీహెచ్ఎన్ పుష్పాంజలి, హెల్త్ సూపర్‌వైజర్ జాన్‌విలియం, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, వైద్య సిబ్బంది, 108, 104 సిబ్బంది పాల్గొన్నారు.


కాశినాయన : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ మైథిలి అన్నారు. శనివారం మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. అన్ని గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

కలసపాడులో ర్యాలీ

కలసపాడు : స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం కలసపాడులో అన్నిశాఖల అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మహబూబ్‌బీ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి, పొడి చెత్తను రోడ్లపై పడేయకుండా తమ ఇంటి వద్దకు వచ్చే హరిత రాయబారులకు అందజేయాలన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలను నాటాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మురళీమోహన్, ఏపీఓ శివశంకర్‌రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ శైలజ, ఎమ్మార్సీ సుధానంద్, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు అందరూ సహకరించాలి

గోపవరం : పరిసరాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ రామనాథరెడ్డి అన్నారు. స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం పంచాయతీ కార్యదర్శి విజయకుమార్ ఆధ్వర్యంలో గోపవరం గ్రామ పంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత కోసం తడి, పొడి చెత్త సేకరణ, ప్లాస్టిక్ వాడకంపై నిషేధం తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్త సేకరణ కోసం ప్రతి ఇంటికి డస్ట్‌బిన్‌లు అందజేశామని, అవన్నీ కూడా ఎప్పటికప్పుడు గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలన్నారు. భవిష్యత్తులో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై అందరూ దృష్టి సారించాలని, అప్పుడే అందరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అలాగే ఇంటింటికి మొక్కలు నాటడం వలన పర్యావరణను కాపాడుకోవచ్చన్నారు. పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రజల సహకారంతోనే సాధ్యమవుతుందని అన్నారు. ముందుగా గోపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి గ్రామ సచివాలయం వరకు అన్నిశాఖల అధికారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ హసీనా, వైద్యాధికారి మహేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ రఘురాములు, ఉపాధ్యాయులు, పోలీసు, అటవీశాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కలసపాడులో..



కాశినాయన : నరసాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



బి.కోడూరులో పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారులు



గోపవరం: పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ రామనాథరెడ్డి

ఇల్లు నిర్మించుకోవాలంటే మామూళ్లు ఇవ్వాల్సిందే

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని అమృతానగర్‌లో సొంత పట్టా ఉన్న స్థలంలో కూడా ఇల్లు నిర్మించుకోవాలన్నా, కాంపౌండ్ వాల్, బాత్రూంలు నిర్మించుకోవాలన్నా సర్పంచ్ అనుచరుడైన ఓబులేసు అనే వ్యక్తి మామూళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడని అమృతానగర్ పేదలు వాపోయారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం నరసింహులు బాధితులకు మద్దతు ఇచ్చి మాట్లాడారు. వైఎస్ఆర్ హయాంలో కేటాయించిన ఇళ్ల స్థలాల విషయంలో ఇళ్లు నిర్మించుకోకుండా అడ్డుపడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు పేర్కొన్నారు. పంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులకు చెప్పినా వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. వీరి వలన భవన నిర్మాణ కార్మికులకు కూడా పనులు లేకుండా పోయాయన్నారు. స్థానిక అధికారులు ఈ విషయంపై స్పందించకపోతే సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామన్నారు. ఈ మేరకు వారు తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో అమృతానగర్ బాధితులు లక్ష్మయ్య, బాషా, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

13వ రోజుకు చేరిన పశువైద్య విద్యార్థుల సమ్మె



పశువైద్య కళాశాల ఆవరణలో సమ్మె చేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని గోపవరం వద్ద ఉన్న పశువైద్య కళాశాలలో స్టైఫండ్ పెంచాలని పశువైద్య విద్యార్థులు చేస్తున్న సమ్మె శనివారం 13వ రోజుకు చేరింది. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని వారు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ శనివారం విజయవాడలోని వీసీసీటీ రాష్ట్ర చైర్మన్ లక్ష్మయ్యను, రిజిస్ట్రార్ ఈశ్వరరావులను కలిసి తమ న్యాయమైన డిమాండ్లను వివరించామన్నారు. అందుకు వారు స్పందిస్తూ వారంలోపు సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే పత్రిక ద్వారా స్పష్టమైన ప్రకటన ఇచ్చేంత వరకు సమ్మెను విరమించమని విద్యార్థులు పేర్కొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



కామనూరు పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తనిఖీ చేశారు. పారిశుధ్యం సరిగా లేకపోవడంతో ఆస్పత్రి సిబ్బందిపై మండిపడ్డారు. ఆస్పత్రి ఆవరణమంతా పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారులకు, సిబ్బందికి ఆయన సూచించారు. అనంతరం ఆస్పత్రి రికార్డులను ఎమ్మెల్యే పరిశీలించారు. వైద్యాధికారి డాక్టర్ హనీఫ్‌బాబా, డాక్టర్ శ్రీనివాస్, సూపర్‌వైజర్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- గోపవరం గ్రామంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి, కార్యదర్శి రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, సర్పంచ్ మోషె తదితరులు పాల్గొన్నారు.
- పొట్టిపాడు రోడ్డులోని కాలువకట్ట వద్ద గంగాభవాని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే వరద పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

శివరాత్రి వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

బద్వేలు అర్బన్ : మహాశివరాత్రి సందర్భంగా రెవెన్యూ డివిజన్ పరిధిలోని బద్వేలు, మైదుకూరు నియోజకవర్గాల్లో శైవక్షేత్రాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని ఆర్డీఓ చంద్రమోహన్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పోలీసులు, అటవీశాఖ, ఎక్సైజ్‌శాఖ, ఆర్టీసీ, వైద్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా శైవక్షేత్రాలకు వచ్చే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడంతో పాటు తాగునీరు, ఇతర వసతులు సమకూర్చాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుశాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే శైవక్షేత్రాల్లో మద్యం అమ్మకాలు జరగకుండా ఎక్సైజ్‌శాఖ అధికారులు నిఘా ఉంచాలని కోరారు. భక్తులకు సమృద్ధిగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా నీటి వసతి కల్పించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. అలాగే ప్రముఖ శైవక్షేత్రాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు 108 వాహనాలను అందుబాటులో ఉంచుకోవాలని వైద్యశాఖ అధికారులకు సూచించారు. అగ్నిప్రమాదాల విషయంలో ఫైర్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై ఫిర్యాదు

మైదుకూరు : పట్టణంలోని కేసీ కాలువ కొండపేట ఛానల్ కట్టపై చెట్ల నరికివేతపై కేసీ కెనాల్ అధికారులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక జోసెఫ్ పేట ప్రాంతంలో కొండపేట ఛానల్ కట్టపై చెట్లను కొందరు నరికివేస్తున్నారని సాక్షిలో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. కేసీ కెనాల్ డీఈఈ పుల్లయ్య స్పందించారు. ఆయన ఆదేశంతో ఏఈ సుబ్బరాయుడు చెట్లను నరికించిన సాంబపై అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెట్లను ఎవరు నరకమన్నారనే విషయం పోలీసుల విచారణలో తెలుస్తుందని ఈ సందర్భంగా కేసీ కెనాల్ ఏఈ సుబ్బరాయుడు పేర్కొన్నారు.

నివాళి

కాశినాయన : మండలంలోని చిన్నాయపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గుర్రాల వెంకటరెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి శనివారం గ్రామానికి వెళ్లి వెంకటరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

పోరుమామిళ్ల : పట్టణంలోని 14వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు షేక్ అబ్దుల్ అమీద్ మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి శనివారం వారి ఇంటికి వెళ్లి అమీద్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మాలల యుద్ధ గర్జనకు తరలిరండి

బద్వేలు అర్బన్ : మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 23న కర్నూలు పట్టణంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న రాయలసీమ మాలల యుద్ధ గర్జన సభకు మాలలంతా లక్షలాదిగా తరలిరావాలని మాలమహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని వారి కార్యాలయంలో సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేయకుండా పార్లమెంటులో బిల్లు పెట్టకుండా వర్గీకరణ అంశాన్ని రాష్ట్రాలపై వదిలేసి జాతుల మధ్య వైషమ్యాలను సృష్టిస్తూ తమ పబ్బం గడుపుకోవాలనే దుర్మార్గమైన ఆలోచన సరికాదన్నారు. కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ నాయకులు కూకట్లపల్లిమురళి, ఎన్.చెన్నరాయుడు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక తొగటవీరక్షత్రియ ఉద్యోగ, వృత్తి నిపుణుల సంక్షేమ సంఘం కార్యాలయంలో శనివారం శ్రీచౌడేశ్వరిదేవి తొగటవీరక్షత్రియ ఆపన్న హస్తం కార్యక్రమంలో భాగంగా పేద కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. జమ్మలమడుగు మండలం ఊడెం చెరువుకు చెందిన వెంకటేశ్ అనే చేనేత కార్మికుడు మృతి చెందాడు. ఆయన భార్య సుమలతకు రూ.15వేలు నగదు, రూ.5వేలు విలువ చేసే నిత్యావసర వస్తువులను సంఘం అధ్యక్షుడు డాక్టర్ కుందా నాగరాజు, గౌరవాధ్యక్షుడు పల్లా విశ్వేశ్వరయ్య అందించారు. కార్యక్రమంలో తొగటవీరక్షత్రియ ఉద్యోగ, వృత్తి నిపుణుల సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.